విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 21, ఆగస్టు 2025

ఒంగోలుకు వేలాదిగా తరలిరండి : రామాంజనేయులు

విశాలాంధ్ర - డోన్: ఒంగోలులో జరిగే సిపిఐ రాష్ట్ర 28వ మహాసభలు ఆగస్టు 23 నుంచి 25 వరకు జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు అన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక నక్కి రామన్న భవనంలో విలేకరుల సమావేశంలో కె.రామాంజనేయులు మాట్లాడుతూ ఉత్సాహ పూరిత వాతావరణంలో 26 జిల్లాల మహాసభలు పూర్తిచేసుకుని 20వ తేదీ నుండి ఒంగోలు నగరంలో సాంస్కృతిక కార్యక్రమాలు కళారూపాలు1000మంది డప్పు కళాకారులు 100 కళారూపాలు 1000 మంది ప్రతి నిధుల 23న వేలాది మందితో భారీ ప్రదర్శన బహిరంగ సభ జరుగుతుందని సభ అధ్యక్షులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, రామకృష్ణ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, డి.రాజా సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ,సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు, కూనంనేని ,సాంబశివరావు హాజరవుతున్నట్లు తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వానికి ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలు మద్దతు ఇవ్వడం అంటే చాలా సిగ్గుచేటు అన్నారు. బిజెపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి11 సంవత్సరాలు కావస్తున్న ఏపీకి ప్రత్యేక హెూదా వెనకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని తిరుపతి వెంకన్న సాక్షిగా అమలు చేస్తామని హామీ ఇచ్చి రాష్ట్ర ప్రజల్ని ముంచిన బిజెపి ప్రభుత్వానికి ఉపరాష్ట్రపతి ఎన్నికలకు మద్దతు తెలపడంరాష్ట్ర ప్రజలను తాకట్టు పెట్టడమని వారున్నారు.కేంద్రంలో బిజెపి ప్రభుత్వం దొంగ ఓట్లతో అధికారం చేపట్టడం సిగ్గుచేటు అన్నారు.ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపైన ఒంగోలులో జరిగేరాష్ట్ర మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మోటా రాముడు సిపిఐ మండల కార్యదర్శి నారాయణ సిపిఐ నాయకులు నాగరాజు రంగస్వామి పాల్గొన్నారు.

నన్నారి సాగును అభివృద్ధి చేస్తాం

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : పట్టణంలోని అర్బన్ కాలనీలో 25 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన నన్నారి ప్రాసెసింగ్ సెంటర్ ను స్త్రీ శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిలు ప్రారంభించారు. అనంతరం అక్కడే చెంచుల కోసం ఏర్పాటుచేసిన కుట్టు మిషన్ సెంటర్‌ను, తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. చెంచు గూడెంలలో తాగు, సాగునీరు, కరెంటు వంటి మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నన్నారి ప్రాసెసింగ్ కేంద్రం ద్వారా వందలాది మందికి ఉపాధి దొరుకుతుందని చెంచుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడం జరుగుతుందన్నారు.

రాష్ట్రమంతటా వరదలు

జుర్రేరు వాగేమో ఖాళీ..

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్ : బనగానపల్లె మండలంలోని దద్దనాల చెరువుని ఎత్తిపోతల పథకం ద్వారా నీటితో నింపి రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగ నాయుడు కోరారు. బుధవారం జుర్రేరు వాగును సీపీఐ బృందం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా జోరుగా వానలు కురుస్తూ వాగులు, వంకలు, నదులలో నీరు వృధాగా పోయి సముద్రంలో కలుస్తూ ఉంటే, జుర్రేరూ (దద్దనాల) చెరువు మాత్రం వానలు పడక నీరు అడిగింటి పోయినట్టుగా కనిపిస్తుంది. రోడ్లు భవనముల శాఖా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సొంత నియోజకవర్గమైన బనగానపల్లెలోని జుర్రేరు వాగు మాత్రం నీరు అడిగింటి పోయింది. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని జుర్రేరు చెరువులో నింపవలసిందిగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయకుంటే ఉద్యమం : రంగనాయుడు

సిమెంట్ పరిశ్రమల దుర్మార్గాలను ఎండగడతాం

మద్దతు ప్రకటించిన మండల టీడీపీ నాయకుడు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : రాంకో సిమెంట్ పరిశ్రమ యజమాన్యం బాధిత రైతులకు న్యాయం చేయకుంటే ఉద్యమం తప్పదని జిల్లా సిపిఐ కార్యదర్శి రంగనాయుడు హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ సాయి సదన్ సమావేశ మందిరం నందు ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలు రైతులు రైతు కూలీల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయన్నారు. పరిశ్రమల కోసం భూమి ఇచ్చిన రైతులకు కనీసం ఉపాధి కూడా కల్పించడం లేదన్నారు. మండలంలోని 16 గ్రామాల పరిధిలో రాంకో అల్ట్రాటెక్ దాల్మియా ఆదానీ పెన్నా సిమెంట్ పరిశ్రమలు రైతుల నుండి దాదాపు 20వేల ఎకరాల సాగు భూములను కొనుగోలు చేసి జీవనోపాధినిపై పొట్ట కొట్టారన్నారు. నోరులేని రైతు రైతు కూలీల కోసం సిపిఐ గొంతుకై నిలుస్తుందన్నారు. పార్టీలకతీతంగా అందర్నీ కలుపుకొని రైతుల పక్షాన పోరాడుతామన్నారు. ఈనెల 26న సిపిఐ రాష్ట్ర మహాసభలు ముగిసిన తర్వాత బాధిత రైతుల కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. సిమెంట్ పరిశ్రమలు రావడం వల్ల రైతులకు రైతు కూలీలకు జీవనోపాధిపోయి గ్రామాలు వల్లకాడయాయన్నారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దృష్టి కూడా సమస్యలు తీసుకువెళ్తామని పరిష్కారం కాకుంటే ఉద్యమానికి సిద్ధమవుతామన్నారు. భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు ఉపాధి కల్పించలేదని, చదువుకున్న యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదని పరిశ్రమలు వచ్చిన గ్రామాలకు ఉపయోగపడలేదని తెలిపారు.

రైతులు, రైతు కూలీలకు న్యాయం జరిగేలా పోరాటం చేస్తున్న సిపిఐ ఉద్యమానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, పోరాటంలో తాము కూడా పాల్గొంటామని మండల టిడిపి నాయకుడు ఓ బాలిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శ్రీ సాయి సదాన్ లో సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడుని కలిసి ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ పోరాటం వల్లనే సిమెంట్ పరిశ్రమల బాధిత రైతులకు కదలిక వచ్చిందని తెలిపారు. సిమెంట్ పరిశ్రమలు బ్రిటిష్ పాలనను తలపించేలా వ్యవహరిస్తున్నాయన్నారు. భూములు ఇచ్చిన బాధిత రైతు సమస్యలను యాజమాన్యాలు పట్టించుకోవడంలేదని దీంతో రైతులు రైతు కూలీలు గ్రామాలలో ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పరిశ్రమలలో రోజువారీ కూలీల పనులను కూడా స్థానికులకు ఇవ్వడం లేదన్నారు. స్థానిక వనరులను వాడుకొని పరిశ్రమ యజమానులు వేల కోట్లు సంపాదిస్తున్న స్థానికులను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగేలా రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ల దృష్టికి తీసుకు వెళ్తామని న్యాయం జరగకుంటే తిరుగుబాటు తప్పదనే హెచ్చరించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, సీనియర్ నాయకులు శివయ్య, కొలిమిగుండ్ల రైతు సంఘం నాయకులు పుల్లయ్య, ఏఐటీయూసీ మండల కార్యదర్శి మహేష్ కుమార్, పట్టణ కార్యదర్శి సూర్యనారాయణ, రైతులు శ్రీకాంత్ రెడ్డి వినయ్ వేణుగోపాల్ రెడ్డి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కానరాని పరిశుభ్రత

విశాలాంధ్ర - నంద్యాల రూరల్ : నంద్యాల జిల్లా నంద్యాల మండల పరిధిలోని పోలూరు గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండి ఏమాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదని... గ్రామంలో ఎక్కడ చూసినా మురికి కాలువల దగ్గర పిచ్చి మొక్కలతో చెత్తచెదరులతో నిండి పోయి దుర్వాసన వస్తుందని... గత మూడు సంవత్సరాల నుండి మురికి కాలువలను పరిశుభ్రం చేయకపోవడంతో కాలువల ద్వారా మురికి నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తుందని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. బుధవారం విశాలాంధ్ర విలేఖరి గ్రామాన్ని వీధి వీధినా పరిశీలించారు. ముఖ్యంగా గ్రామాల అభివృద్ధి కొరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వేలాది రూపాయల ఖర్చు చేస్తూ ప్రతి మాసం మూడవ శనివారం స్వచ్ఛభారత్ స్వచ్ఛంద్ర నినాదంతో పరిశుభ్రం చేయాలని మరియు గ్రామాల అభివృద్ధి కొరకు పాటుపడాలని ఆదేశాలు ఉన్నాయి. కానీ పోలూరు గ్రామంలో ఎక్కడ చూసినా మురికి కాలువల వెంట పిచ్చి మొక్కలు ప్లాస్టిక్ బాటిల్ అలాగే చెత్త చెదారంతో దర్శనమిస్తూ అంటురోగాలు ప్రబలడానికి ఆస్కారం ఉందని దీంతో అధికారులు స్పందించకపోవడం కడు శోచనీయమని బహిరంగంగా ప్రజలు విమర్శిస్తున్నారు. నంద్యాల మండలంలోని పోలూరు గ్రామంలో సుమారుగా ఐదువేల జనాభా నివాసముం టున్నారు. జనాభాను దృష్టిలో పెట్టుకొని గ్రామని అభివృద్ధి చేయాలని గ్రామ సర్పంచ్, పంచాయతీరాజ్ వ్యవస్థ అలాగే పంచాయతీ కార్యదర్శి బాధ్యత వహించాల్సి ఉంది. అయినా గత మూడు సంవత్సరాల నుండి మురికి కాలువలను శుభ్రం చేయకపోవడం వల్ల చెత్తాచెదారాలతో కాలువలు మూసుకుని పోయాయని ప్రజలు బహిరంగంగా చర్చించుకోవడం విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా గ్రామ సచివాలయం దగ్గర అంగన్వాడి కేంద్రం నిర్వహణలో ఉంది. అక్కడ చదువు కొనసాగిస్తున్న విద్యార్థిని విద్యార్థులు బయటికి వస్తే పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో విషపూరితమైన పురుగులు సంచరిస్తున్నడంతో ప్రమాదవశాత్తు పిల్లలకి ఏమైనా ప్రమాదం వస్తుందేమోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



సర్పంచ్ అందుబాటులో ఉండడు...

శాశ్వత ప్రాతి పాదికన పంచాయతీ కార్యదర్శి లేదు...దీంతో గ్రామ సర్పంచ్ అందుబాటు లేకపోవడం గ్రామానికి శాశ్వత ప్రాతిపదికన పంచాయతీ కార్యదర్శి లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని గ్రామ ప్రజలు విశాలాంధ్రకు తెలియజేశారు. కాగా గ్రామ సర్పంచ్ గ్రామంలో లేకపోవడం వల్ల అలాగే పంచాయతీ కార్యదర్శి రెగ్యులర్‌గా లేకపోవడం వారానికి ఒకసారి సర్పంచ్ గ్రామాల్లో ఉండడంవల్ల పరిస్థితులు ఏర్పడ్డాయని గ్రామ ప్రజలు తెలుపుతున్నారు. సచివాలయం దగ్గర వెనుక భాగాన అలాగే అంగన్వాడి సమీపంలో పిచ్చి మొక్కలు పెరిగి పంట పొలాలను తలపిస్తున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. అందువల్ల జిల్లా ఉన్నత అధికారులు ఇప్పటికైనా గ్రామాన్ని సందర్శించి గ్రామంలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలని గ్రామ ప్రజలు పత్రికాముఖంగా విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉద్యోగ అవకాశాల్లో మాకు న్యాయం చేయండి

విశాలాంధ్ర - నందికొట్కూరు : జిఓ నెం3 ను పునరుద్ధరించి ఉద్యోగ అవకాశాల్లో మాకు న్యాయం చేయండి అంటూ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని చెంచు గిరిజనులు వేడుకున్నారు. బుధవారం నందికొట్కూరు మండలానికి చెందిన చెంచు కాలనీలో నివాసం ఉంటున్న చెంచులు మా చెంచు కాలనీ యందు అందరం సమావేశమై ప్రస్తుత ఉన్న సమస్యల గురించి ఆదివాసి గిరిజన చెంచు టీచర్ ఉద్యోగాలు జనరల్‌లో కలపడం జరిగిందని గుర్తించి మా నందికొట్కూరు చెంచు కాలనీ యందు డిఇడి, బిఇడి, చదువుకున్న చెంచు అభ్యర్థులు నిరుద్యోగులుగా ఉన్నారన్నారు. వారు టెట్,2025 డియస్సి కూడా ఉత్తీర్ణులైయున్నారని జిఓ నంబర్ 3ను పునరుద్ధరించి న్యాయం చేయాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. గిరిజనులకు ఉద్యోగాల్లో100 శాతం నియామకం కల్పించే జీవోను రద్దు చేయడం అన్యాయం అన్నారు. ఈ జీఓ రద్దును పున:పరిశీలించి, పునరుద్ధరించాలని కోరారు. గిరిజనులకు న్యాయం చేయాలనీ, వారి ఉద్యోగాల రక్షణకు వెంటనే చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విటిడిఏ నందికొట్కూరు అధ్యక్షులు వి.రాముడు, సెక్రటరీ సంజమ్మ, వెంకటేశ్వర్లు, సువర్ణమ్మ, శ్వేతా,తేజస్విని,అశ్విని తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించాలి

విశాలాంధ్ర - మిడుతూరు : సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించడం ద్వారా తెగుళ్ళను సమర్థవంతంగా నివారించవచ్చని ఏవో పీరు నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చెరుకుచెర్ల తలముడిపి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పంటలను ఆశించే చీడపీడల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి కృత్రిమ ఎరువులను వినియోగించాలని సూచించారు. రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని, పంట ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లు అశోక్, మల్లికార్జున రెడ్డి, ఆర్‌బికే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లకోరి పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపిక

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నిరంజన్, హరినరసింహులు జాతీయస్థాయి లకోరి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు జీవయ్య తెలియజేశారు. బుధవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో వారు మాట్లాడుతూ ఇటీవల కడప జిల్లా మైదుకూరు మేధా డిఫెన్స్ అకాడమీ నందు నిర్వహించిన రాష్ట్ర స్థాయి లకోరి పోటీల్లో బాలుర సీనియర్ విభాగంలో నంద్యాల జట్టుకు ప్రాతినిధ్యం వహించిన స్థానిక పాఠశాలకు చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు.త్వరలో మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. జాతీయ స్థాయికిఎంపికైన విద్యార్థులను అభినందించారు కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ఐడీకే శాస్త్రి, మహబూబ్ బాషా,నారాయణమూర్తి, శివశంకర్,పిడి శ్రీనాథ్ రెడ్డి, పి ఈ టి ఆశాజ్యోతి రెడ్డి పాల్గొన్నారు.

నీట్ పీజీ ఎంట్రెన్స్‌లో ఆలిండియా ర్యాంక్

విశాలాంధ్ర-అవుకు : అవుకు పట్టణానికి చెందిన కుమ్మిత లక్ష్మి కీర్తన దేవి నీటి పీజీ ఎంట్రెన్స్‌లో ఆల్ ఇండియాలో 1185 ర్యాంకు సాధించి అద్భుత ప్రతిభను కనబరిచింది. తండ్రి కే.బి సంజీవరెడ్డి,రామాపురం ఎంపీపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా,తల్లి ప్రసన్న లక్ష్మి స్థానిక మదర్ మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరూ కూతుర్లు సంతానం.పెద్ద కూతురు లక్ష్మి కీర్తన దేవి 6 నుండి 10 వరకు నవోదయ బనవాసిలో, ఇంటర్ కర్నూలు చైతన్య కాలేజీలో,ఎంబిబిఎస్ కడప రిమ్స్‌లో విద్యభాసం చేసింది.డాక్టర్ లక్ష్మీ కీర్తన దేవి మాట్లాడుతూ లక్ష్యంతో కష్టపడి చదివానని,తమ తల్లిదండ్రుల ఆశయాలతోనే ఈ విజయాన్ని సాధించా నన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించడమే తన లక్ష్యమన్నారు. అద్భుత ప్రతిభ కనబరిచిన వైద్యురాలిను పలువురు ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, అభినందించారు.

దివ్యాంగుల పాలిట శాపం

నియోజకవర్గంలో భారీగా పింఛన్లు తొలగింపు

ఆందోళన చెందుతున్న దివ్యాంగులు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రభుత్వాలు పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు సంక్షేమ పథకాలు అందించి ఆదుకుంటున్నాయి. వృద్ధులు, దివ్యాం గులు, ఒంటరి మహిళలు, వితంతువులు, మానసిక వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మొదలైన వారికి పింఛన్లు నందిస్తూ వారి కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలుస్తుంది. కూటమి ప్రభుత్వము అధికారంలోకి రాకముందు వికలాంగులకు పింఛన్ పెంచి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తీరా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ పెంచినట్లు పెంచి మరల అంగవైకల్యం శాతాల పేరుతో పింఛన్లు తొలగిస్తున్నారు. గత ప్రభుత్వంలో అనర్హులకు పింఛన్లు అందించిందని వాటిని తగ్గించే విధంగా కూటమి ప్రభుత్వం సదరన్ క్యాంప్‌లు ఏర్పాటుచేసి వైద్య పరీక్షలు చేయించి అనేకమందికి 40శాతం కంటే తక్కువగా వికలాంగత్వం ఉందని పింఛన్‌కు అనర్హులంటూ గత మూడు రోజులుగా నోటీసులు జారీ చేస్తున్నారు. ఎక్కువగా అనర్హులంటూ, మరి కొంతమందిని కన్వెన్షన్ సాకుతో తొలగించారు. రుద్రవరం మండలంలో వివిధ అంగ వైక ల్యం కలిగిన వారికి 703పింఛన్లు వస్తున్నాయి. ఇందులో పింఛన్ తీసుకుంటున్న వారు అంగవైకల్యం 40 శాతం తక్కువగా ఉన్నాయంటూ 110పింఛన్లను అధికారులు తొలగించారు. ఆళ్లగడ్డ మండలంలో 539 పెన్షన్లకు గాను 99 పింఛన్లను తొలగించారు. చాగలమర్రి మండలంలో 723 పెన్షన్లకుగాను 127 పింఛన్లను తొలగించారు. మున్సిపాలిటీ పరిధిలో 509 పెన్షన్లుకు గాను 71 మందికి నోటీసులు జారీ చేశారు. ఉయ్యాలవాడ మండలంలో 30 మందికి నోటీసులు జారీ చేశారు. సిరివెళ్ల , దొర్నిపాడు మండలాల్లో కూడా అనేకమంది వికలాంగుల పెన్షన్లు అనర్హులంటూ, మరి కొంతమందినీ కన్వెన్షన్ సాకుతో నోటీసులు జారీ చేశారు. నోటీసులు జారీ కావడంతో వీటికి సంబంధించి వెరిఫికేషన్ చేయించుకోవడానికి నియోజకవర్గాల్లోని మండల పరిషత్ కార్యాలయాలకు వివిధ గ్రామాల నుంచి వికలాంగులు వారి బంధువుల సాయంతో చేరుకొని కార్యాలయంలో తమకు అంగవైకల్యం ఉందంటూ డాక్టర్లు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలను కార్యాలయంలో వెరిఫికేషన్ నిమిత్తం అధికారులకు అందజేస్తున్నారు. అన్ని అర్హతలతో దశాబ్దాల నుంచి పింఛన్ తీసుకుంటున్న తమకు ఎందుకు ఇలా వేధిస్తున్నారని వికలాంగులు వాపోయారు. వికలాంగుల పెన్షన్ పెంచినట్లే పెంచి ఇలా శాతాల పేరుతో తొలగించడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం తమ పాలిట శాపంగా మారడంతో ఏం చేయాలో అర్థం కాక దివ్యాంగులు వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వికలాంగుల బాధలను దృష్టిలో పెట్టుకొని అధికారులు తొలగించిన పింఛన్లను పునరుద్ధరించి గతంలో మాదిరిగానే పింఛన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పెంఛన్ తొలగించారు...

చాకలి నడిపి కొండయ్య, చిన్న కందుకూరు గ్రామం

వంద శాతం వికలాంగత్వం ఉందని డాక్టర్లు నిర్ధారించి ధ్రువీ కరణ పత్రం మంజూరు చేశారు . నాకు మూగ, చెవుడు. దాదా పు 15సంవత్సరాల నుంచి పింఛన్ తీసుకుంటున్నాను. ఇప్పుడు అధికారులు 40శాతం కన్నా తక్కువగా వికలాంగత్వం ఉందంటూ నా పింఛన్‌ను తొలగించారు. డాక్టర్లు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని అధికారులు చూడకుండా ఇలా పెన్షన్ తొలగించడం అన్యాయం. ఉన్నతాధికారులు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి పెన్షన్ యధావిధిగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

న్యాయం చేయండి : ఓబులేసు నల్లగట్ల గ్రామం

ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల గ్రామానికి చెందిన ఓబులేసు అంధుడు కావడంతో ప్రతినెల రూ.6వేలు పెన్షన్ అందుకుంటున్నారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పెన్షన్ దారులను రీవెరిఫికేషన్ చేస్తున్న క్రమంలో ఓబులేసు పెన్షన్ పొందేందుకు అనర్హుడుగా డాక్టర్లు సర్టిఫై చేయడంతో లబ్ధిదారుడు గుడిసె చిన్న ఓబులేసు తన తల్లి సుబ్బమ్మతో కలిసి బుధవారం ఆళ్లగడ్డ ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి ఎంపీడీవోకు తనకు న్యాయం చేసి పెన్షన్ పునరుద్ధరించాలని వినతి పత్రం అందజేశారు. గత 14 సంవత్సరాలుగా పెన్షన్ తీసుకుంటున్నానని ఇప్పుడు హఠాత్తుగా పెన్షన్ తీసేయడం ఎంతవరకు సబబని ఆయన ప్రశ్నించారు.

బెలుం గుహలను సందర్శించిన డీఐజీ

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మండలంలోని బెలుం గుహలను కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ బుధవారం సందర్శించారు. కొలిమిగుండ్ల సీఐ రమేష్ బాబు, గుహల మేనేజర్ కిషోర్, గుహల సిబ్బంది డిఐజికి ఘన స్వాగతం పలికారు. గుహలోని కోటిలింగాలు, ధ్యాన మందిరం,పాతాళ గంగ, మాయా మందిరం, ఊడల మర్రి, తదితర వాటిని ఆయన వీక్షించారు.గైడ్లు గోవర్ధన్, వెంకటరెడ్డిలు గుహలు ఏర్పడిన విధానము, ప్రాముఖ్యత, వెలుగులోకి వచ్చిన విధానము, గుహల అభివృద్ధి, జాతికి అంకితము, పర్యాటక శాఖ చేపట్టిన తదితర వాటిని డీఐజీ ప్రవీణ్ కు సమగ్రంగా వివరించారు. గుహలను జాతికి అంకితం చేసిన తర్వాత దేశీయ పర్యాటకులతో పాటు విదేశీ పర్యాటకులు పెరిగారని తెలిపారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : బాల అకాడమీ విద్యార్థులకు సిపిఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. నేటి ఆధునిక జీవన విధానంలో జీవన ప్రమాణాలు తగ్గిపోతున్నాయని, గుండెపోటుతో మరణించే వారి సంఖ్య పెరిగిపోతున్నదని, ఒక వ్యక్తి గుండె ఆగినప్పుడు లేదా శ్వాస తీసుకోవడం ఆగినప్పుడు వారి ప్రాణాలను కాపాడడానికి చేసే అత్యవసర చికిత్స సిపిఆర్ అని బాల అకాడమీ ప్రిన్సిపల్ మాధవిలత తెలిపారు. మణిదీప్, ధ్రువన్ అనే విద్యార్థులు అతి చిన్న వయసులోనే సేవా దృక్పథంతో అమెరికా నుండి భారత్ కు వచ్చి ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు సి.పి.ఆర్‌పై అవగాహన కలిగిస్తూ విద్యార్థులకు స్ఫూర్తినందిస్తున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు డాక్టర్ రజనీ ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా బాలకాడమీ ప్రిన్సిపల్ మాధవిలత మాట్లాడుతూ సిపిఆర్ పై అవగాహన కలిగించి, విద్యార్థులను ప్రోత్సహించినందుకు మెడ్ ఇంపాక్ట్ బృందానికి కృతజ్ఞతలు తెలుపుతూ మణిదీప్ మువ్వల, ధ్రువన్ జి.రెడ్డిలను ఘనంగా సన్మానించారు.

అర్హులైనవారికి పింఛన్ పునరుద్ధరించాలి

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : గత ఎన్నో సంవత్సరాలు నుండి సదరం క్యాంపుకు వెళ్లి డాక్టర్ సర్టిఫికెట్‌తో పింఛన్ తీసుకుంటున్న దివ్యాంగులు, మూగ, చెవిటి వారి పేదల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు పెట్టి తొలగించడం చాలా విడ్డూరమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్ బాబు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు పింఛన్ దారులతో కలిసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు మాట్లాడుతూ తొలగించిన పింఛన్ దారులకు పింఛన్ ఇవ్వాలని, పింఛన్ తొలగిపోయిన వారు అనేకమంది భయందోళనకు గురవుతున్నారని పింఛన్ లేనిదే పూట గడవని పరిస్థితి ఉందని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు, సిపిఐ నాయకులు నరసింహ, రాజు, పింఛన్ దారులు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన : ఏవో

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : పట్టణ పరిధిలోని దోరాసి గ్రామంలో వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి శాస్త్రవేత్తలతో కలిసి బుధవారం పంట పొలాలను పరిశీలించారు. ఇటీవలే కురిసిన అధిక వర్షాలకు పంట పొలాలలో చేపట్టవలసిన సస్య రక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. వరి, మొక్కజొన్న తదితర పంట పొలాలను పరిశీలించారు. మొక్కజొన్న పంట అధిక తేమ వలన పంట దెబ్బ తినే ప్రమాదం ఉంది అందుకు తగినట్లు రైతు పంట పొలాలను కీడు లేకుండా తీసుకోవలసిన సస్యరక్ష చర్యలను రైతులకు వివరించారు. వరి పంట రెండు మూడు రోజులపాటు నీట మునిగిన తట్టుకోగలదని వరిమలలో నిలిచిన నీరును నిలువ లేకుండా చూసుకోవాలని ఆయన అన్నారు. వరి పంటలో తీసుకోవలసిన శస్య రక్షణ చర్యలను రైతులకు సూచించారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గిరిజనులను ఐటీడీఏ పరిధిలో చేర్చాలి

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : ఆత్మకూరు,నందికొట్కూరు నియోజకవర్గ మండల కేంద్రాల్లో వందలాదిమంది గిరిజనులు పూరి గుడిసెలో నివసిస్తున్నారని ముఖ్యంగా జూపాడుబంగ్లా సిద్దేశ్వరం, మహానంది మండలం అబిపురం గ్రామంలో నివసిస్తున్న గిరిజనులు ఐటిడిఏ పరిధిలో ఇంతవరకు చేర్చక పోవడం సిగ్గుచేటు అయిన విషయమని తక్షణమే వారిని ఐటిడిఏ పరిధిలోకి చేర్చాలని 80బన్నూరు గ్రామ గిరిజనులు అర సేంట్ స్థలంలో మూడు కుటుంబాల నివసిస్తున్నారని వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎర్రమతం, వెంపెంట, శివాపురం, మాదుగుల, బైర్లటి, తన గ్రామాల గిరిజనుల తాండాలలో మౌలిక వసతులు కల్పించి పక్కా గృహాలు నిర్మించాలని కోరుతూ గిరిజన తండాలను పరిశీలించకుండా నిర్లక్ష్యం చేస్తున్న శ్రీశైలం ఐటిడిఏ పిఓ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు విచ్చేసిన ఏపి స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు శ్రీమతి గుమ్మడి సంధ్యారాణికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు ఆత్మకూరు తాలూకా కార్యదర్శి టి.ప్రతాప్, కొత్తపల్లి మండల కార్యదర్శి వెంకట శివుడు, జూపాడు బంగ్లా మండల కార్య దర్శి శ్రీనులు కలిసి గిరిజనుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ విషయంపై శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాకు క్షుణ్ణంగా వివరించారని మంత్రిగారు చెప్పడం జరిగింది. ఇంకా మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రైతుల అభివృద్ధికి కృషి చెయ్యాలి

విశాలాంధ్ర- బనగానపల్లె: పెద్ద కొప్పెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ కమిటీ చైర్మన్ రైతుల అభివృద్ధికి సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని రోడ్లు భవనాలు పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సూచించారు. బుధవారం నాడు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని పెద్ద కొప్పెర్ల వ్యవసాయ సొసైటీ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన కోయిలకుంట్లకు చెందిన గడ్డం వెంకటేశ్వర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా కలిశారు.

ఏపీవోగా ఉమా మహేష్

విశాలాంధ్ర - చాగలమర్రి : చాగలమర్రి ఉపాధి ఏపీఓగా ఉమా మహేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. చాగలమర్రి ఏపీవోగా విధులు నిర్వహిస్తున్న ఖాసీం నంద్యాల పిడి కార్యాలయానికి బదిలీ అవ్వగా రుద్రవరం ఏపీఓగా ఉన్న ఉమా మహేష్ చాగలమర్రి ఏపివోగా బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకంలో నిర్దేశిత లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేస్తానని తెలియజేశారు.

స్మశాన సేవకులకు కిట్ల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల హిందూ స్మశాన వాటికలో పనిచేస్తున్న శ్మశాన సేవకులు (కాటికాపరులకు) వాళ్ళు చేస్తున్న సేవలకు గుర్తింపుగా రెడ్ క్రాస్ జిల్లా ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ రాజకుమారి సలహా మేరకు రెడ్ క్రాస్ సొసైటీ, ఐఎంఎ, నంద్యాల కలిసి 11 మందికి వంట సామగ్రి, దోమతెరలు, దుప్పట్లు, ప్లాస్టిక్ బకెట్లు తదితర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మధుసూదన్ రావు మాట్లాడుతూ మున్సిపల్ హిందూ స్మశానవాటిక నందు పనిచేస్తున్న కాటికాపరులకు జిల్లా కలెక్టర్ గుర్తించి గృహోపకరణాలు అందజేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. స్వర్గధామం అభివృద్ధికి అందరూ సహాయపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ మాజీ అధ్యక్షులు దస్తగిరి, మాజీ ట్రెజరర్ నాగేశ్వరావు, ఆనంద్ గురూజీ, చిత్తలూరు రామప్రసాదు, ద్వారక వసంతు, నరసింహ తదితర సభ్యులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 21, ఆగస్టు 2025

కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలి : కె.జగన్నాథం

విశాలాంధ్ర - కర్నూలు : రాష్ట్రంలో కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని కౌలు రైతులను ఆదుకోవాలని బ్యాంకులు కౌలు రైతులకు రుణాలు ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారని, తక్షణమే కవులు రైతులకు అందరికీ పంట రుణాలు ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వేలాదిమంది కౌలు రైతు ఉన్నారని, కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వకుండా బ్యాంకు అధికారుల పదేపదే తిప్పుతున్నారన్నారు. లీడ్ బ్యాంకు ఆదేశాల ప్రకారం రైతులకు, కౌలు రైతులకు రూ.2 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలన్నారు. పంట నష్టపరిహారం జరిగితే నష్టపరిహారం కౌలు రైతులకు అందేవిధంగా చూడాలన్నారు. భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలన్నారు. కౌలు కార్డు ఆధారంగా పంట రుణాలు ఇవ్వాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని పదేపదే బ్యాంకు మేనేజర్లకు చెప్పిన బ్యాంకు మేనేజర్లు రైతులను బ్యాంకుల చుట్టూ తిప్పుతున్నారని, సబ్సిడీలు రుణమాఫీ రైతు భరోసా ఇలాంటి పథకాలన్నీ కౌలు రైతులకు వర్తింప చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, రబియా పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కర్నూలు : ఈ నెల 23 నుండి 25 వరకు ఒంగోలు పట్టణంలో జరిగే సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. బుధవారం సీఆర్ భవన్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎన్.లెనిన్ బాబులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ కరణ అడ్డుకుంటామని కార్మికులకు అండగా ఉంటామని హామీ ఇచ్చి నేడు కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేస్తుంటే వారి అడుగులకు మడుగులొత్తుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ వామపక్ష పార్టీల పోరాటాలతో విద్యార్థుల యువకుల బలిదానాలతో సాధించుకోవడం జరిగిందని, దాని ఎన్నటికీ ప్రైవేటీకరణ కానివ్వబోమని, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం, కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం ఉద్యమ కార్యచరణ రూపొందించడానికి ఒంగోలులో జరుగుతున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు చర్చ వేదిక కానున్నాయని, ఈ మాసభలకు జిల్లా నుండి సీపీఐ కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.జగన్నాథం, జిల్లా సమితి సభ్యులు సి.మహేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గాజులదిన్నె ప్రాజెక్టుకు పెరిగిన వరద నీరు

విశాలాంధ్ర - గోనె గండ్ల: ఎడతెరిపి లేకుండా, కురుస్తున్న వర్షాలకు, గాజుల దిన్నె ప్రాజెక్టుకు పెరిగిన వరద నీరు, వచ్చి చేరుతుంది. దాదాపు 15రోజుల నుంచి, రోజు వర్షం కురియడంతో వరద నీరు, ఎగువ ప్రాంతాలైన, మద్దికెర, పత్తికొండ, ఆస్పరి, దేవనకొండ, మండాలల్లో కురిసిన వర్షాలకు, జలాశయానికి, ఒకటీఎంసీ వరద నీరు వచ్చి చేరినట్లు ప్రాజెక్టు ఏఈ మహమ్మద్ అలీ, అలియాస్ (చిన్న అలీ), బుధవారం తెలిపారు.డ్యాం ప్రస్తుతం ,నీటి సామర్థ్యం 2.53 టీఎంసీ చేరిందిన్నారు. జలాశయనికి వరదనీటితో, పాటు, తుంగభద్ర కాల్వ నుంచి, 120 క్యూసెక్కులు, హంద్రీనీవా నుంచి 160 క్యూసెక్కుల, నీరు వస్తుందన్నారు.

విద్యుత్తు సరఫరాలో మార్పులు

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్తులో మార్పులు చేస్తున్నట్లు ఏఈ మద్దిలేటి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ మండల పరిధిలోని లక్కసాగరం, చిట్యాల సబ్ స్టేషన్ పరిధిలో కరెంటు పనులు కొనసాగుతుండడంతో విద్యుత్‌లో మార్పులు చేపట్టినట్లు రైతులు, ప్రజలు గమనించాలన్నారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సింగల్ ఫేస్ కరెంటు ఉంటుందన్నారు. ఉదయం 3 గంటల నుండి 8 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుండి 6 గంటల వరకు త్రీఫేస్ కరెంటు సరఫరా ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు కరెంటు అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. విద్యుత్ వినియోగదారులు కరెంటు లేదని, ఎవరు సొంత ప్రయత్నాలతో కరెంటు పనులు చేయకూడదని ఆయన తెలిపారు.

రాష్ట్ర 28వ మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కోడుమూరు : ఈ నెల 23 నుంచి ఒంగోలులో సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలు జయప్రదం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి శేషకుమార్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుగిడే మాధవస్వామి, ఏఐటీయూసీ కార్యదర్శి చిన్నరాముడు, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు విశ్వనాథ్, బజారి, ఆటో యూనియన్ నాయకులు మధులు పిలుపు నిచ్చారు. బుధవారం పట్టణంలోని స్థానిక ఏఐటీయూసీ కార్యాల యంలో ఈ నెల 23న ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభల గోడ పత్రికలను వారు విడుదల చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రంగస్వామి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయ కులు బాబురావు, హనుమంత్, ఇంద్రజిత్ గుప్తా నగర్ నాయకులు వెంకటరాముడు, చేనేత అధ్యక్షులు మహబూబ్ బాష, ఆటో యూని యన్ నాయకులు చిన్న, హమాలీ సంఘం నాయకులు, బజారి, శంకర్, మద్దిలేటి, వెంకటస్వామి, నాగేష్, మణి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకేది భద్రత..

విశాలాంధ్ర - హొళగుంద: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ స్కూల్ ప్రధాన గేటు ముందు ఉన్న వంకపై నిర్మించిన కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడ లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన గేటు ముందు వంకనీరు ప్రవహిస్తుంది. వంకపై కల్వర్టు నిర్మించి, కల్వర్టుకు ఇరువైపులా రక్షణగోడ లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రక్షణ గోడ లేకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు వాహనాల్లో ప్రయాణించే వారు ప్రమాదవశాత్తు వంకలో పడిపోయే ప్రమాదం నెలకొందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ పాఠశాలలో దాదాపు 1900 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. కల్వర్టుకు ఇరువైపులా అధికారులు రక్షణగోడ నిర్మిస్తే ఎవ్వరికి ఎలాంటి ఇబ్బంది ఉండదని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

విశాలాంధ్ర - పత్తికొండ: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని అర్బన్ సీఐ జయన్న, రూరల్ సీఐ పులి శేఖర్ గౌడ్ హెచ్చరించారు. బుధవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పత్తికొండ పట్టణంలో రౌడీషీటర్లు, అనుమానితులు, మట్కా బీటర్లు వారి ఇళ్లపై కాటన్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా సోదాలు నిర్వహించడం జరిగిందని, వాహనాలు తనిఖీలలో 11 మోటార్ సైకిల్లు-1 ఆటోను పట్టుకోవడం జరిగిందన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచడం అయిందని, నేరాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవనకొండ, ఆస్పరి సీఐలు, 8 మంది ఎస్ఐలు, 50 మంది పోలీసులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి

విశాలాంధ్ర - కర్నూలు: అంగన్వాడీల వేతనాలు పెంచాలని ఏఐటీ యూసీ, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం అంగన్వాడీ పీడీ విజయకు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, సీఐటీయూ నగర నాయకులు రఫీ, అంగన్వాడీ నాయకులు చౌడేశ్వరి, బాలదుర్గమ్మలు కలసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, ఏఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

విశాలాంధ్ర - నందవరం: రైతులకు సకాలంలో యూరియాను అందించే ఏకైక ప్రభుత్వం టీడీపీ కూటమి ప్రభుత్వం అని మండల టీడీపీ అధ్యక్షులు మాచాపురం కాశీం వలి, సొసైటీ ఛైర్మన్ ధర్మపురం గోపాల్ అన్నారు. బుధవారం మండలంలోని నడికైరవాడిలో రైతులు యూరియాను అందించారు. వారు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో రైతులకు యూరియా సమస్య రాకుండా ఎప్పటికప్పుడు యూరియాను కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతుల పక్షపాతి అయినందుకే సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ కింద ఒక్కో రైతుకు మొదటి విడతగా రూ. 7వేలు అందించడం జరిగిందన్నారు. ఐటీడీపీ అధ్యక్షులు వీరేష్, జనసేన అధ్యక్షులు యల్లప్ప, గ్రామ పార్టీ అధ్యక్షులు బజారి పాల్గొన్నారు.

పారిశ్రామిక హబ్‌లో స్థానిక యువతకు ఉపాధి కల్పించాలి : సీపీఐ

విశాలాంధ్ర - ఓర్వకల్లు: రాష్ట్ర ప్రభుత్వం ఓర్వకల్లును పారిశ్రామిక అభివృద్ధిగా కేంద్రంగా నిధులు కేటాయించడం అభినందనీయమని, స్థానిక యువతకు ఉద్యోగాలు, ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నక్కి లెనిన్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బుగ్గ రామేశ్వర్ డిగ్రీ కాలేజ్ నందు సీపీఐ 28వ రాష్ట్ర మహా సభల పోస్టరును జిల్లా సహాయ కార్యదర్శి నక్కి లెనిన్ బాబు మండల సీపీఐ కార్యదర్శి ఎ.రమేష్ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శ నక్కి లెనిన్ బాబు మాట్లాడుతూ సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 20 నుండి 25వ తేదీ వరకు ఒంగోలు పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో అనేక ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమలు వచ్చినప్పటికీ స్థానిక యువతకు ఉపాధి లేక నిరాశ మిగిలిందని ఆరోపించారు. గ్రీన్కో సోలార్, విమానశ్రయం, జయరాజ్ స్టీల్ ప్లాంట్, ఏపీఐఐసి వివిధ సంస్థలున్న ఎందుకు యువతకు ఉపాధి కల్పించడం లేదని ప్రశ్నించారు. హంద్రీనీవా కాలువ మన జిల్లాలో ఉన్నప్పటికీ సాగునీటికి నీరు అందడం లేదని, కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి అన్ని చెరువు నీరు నింపడంతో పాటు పిల్లకాలవల ద్వారా సాగునీటికి నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో ఆటో యూనియన్ నాయకులు సంజీవరాజు, రమేష్, ఏఐవైఎఫ్ బాబు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఆలూరు : సీపీఐ 28వ రాష్ట్ర మహాసభల ఒంగోలు నగరంలో ఈనెల 23, 24, 25వ తేదీల్లో జరుగుచున్న ఈ మహాసభలు జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్, సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, పిలుపునిచ్చారు. బుధవారం ఆలూరు కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఎస్ఎస్ బాష, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి రంగన్న, రైతు సంఘం నాయకులు చంద్రకాంత్ రెడ్డి, చాపల గోపాల్, సిద్దేశ్వర కాలనీ శాఖ కార్యదర్శి సిద్ధిలింగ, రామంజి, ఉలిగప్ప, దుర్గప్ప పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఆదోని రూరల్: ఒంగోలు నగరంలో నేటి నుంచి ఈ నెల 25 వరకు జరుగు సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు గోడ పత్రికలు విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావిరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కొత్తూరు గంగన్న, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మదిరి ఎల్లప్ప, ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకన్నలు, నాయకులు కరెంటు ఈరన్న, శేషప్ప, మునిస్వామి పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్‌లను పునరుద్ధరించాలి

విశాలాంధ్ర-ఆదోని: వివిధ కారణాలతో తొలగించిన 488 దివ్యాంగుల పింఛన్‌లను పునరుద్ధరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.సుదర్శన్, పట్టణ కార్యదర్శి టి.వీరేశష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఏఐవైఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎన్నో అమలు చేయలేని వాగ్దానాలను ఇచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం అనేక పొంతన లేని కారణాలతో అర్హులైన దివ్యాంగుల పింఛన్‌లపై కోతలు విధించడం సరైంది కాదన్నారు. అధికారులు ఆయా సచివాలయ పరిధిలోనే సదరం క్యాంపులు నిర్వహించి, కోతవిధించిన పింఛన్లను పునరుద్ధరించాలన్నారు.

రైతులందరికి అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలి

విశాలాంధ్ర - పెద్ద కడబూరు: పట్టాదారు పాసుపుస్తకం ఉన్న ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధ వారం పెద్ద కడబూరులో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని కేవలం పట్టా భూములకే వర్తింపజేస్తూ, ప్రభుత్వ భూములు ఉన్న రైతులను గాలికి వదిలేసి అందరికీ అన్నదాత సుఖీభవ పథకం ఇచ్చామని చెప్పడం సిగ్గుచేటన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా కూటమి ప్రభుత్వం షరతులు లేకుండా ల్యాండ్ సీలింగ్ భూములకు, అసైన్డ్ భూములకు, ఇనాం తదితర అన్ని భూములకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలన్నారు. అలాగే రైతులకు పెట్టుబడి సహాయం కింద ఇచ్చే 20 వేల రూపాయలు విడతల వారీగా కాకుండా ఒకేసారి రైతుల ఖాతాల్లో జమ చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, రాము, రామాంజి, ధనుంజయ్, వడ్డే రాముడు తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటలోపడి ఆరుగురు విద్యార్థులు

మృత్యుఒడికి

చిగలి గ్రామంలో విషాధం

విశాలాంధ్ర - ఆస్పరి : మండల పరిధిలోని చిగళి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. బుధవారం సాయంత్రం నీటి కుంటలో పడి ఆరుగురు విద్యార్థులు మృతి చెందారు. మృతిచెందిన వారంతా స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు. ఈత కోసం వెళ్ళిన విద్యార్థులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృత్యువాత పడ్డారు. దీంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల మేరకు.. చిగళి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు స్కూల్ విడిచిన తర్వాత ఎవరి ఇళ్లకు వాళ్ళు వెళ్ళిపోయారు. ఇంటిలో స్కూల్ బ్యాగులు పెట్టిన అనంతరం గ్రామ శివారులోని హైస్కూల్ బిల్డింగ్ నిర్మాణపు పనులు జరుగుతున్న సమీపంలో నీటి కుంటలో సరదాగా ఈత కొట్టడానికి శశి కుమార్, కిన్నెర సాయి, భీమా, సాయి కిరణ్, వీరేంద్ర, మహబాబు, దుర్గాప్రసాద్ మొత్తం ఏడుగురు విద్యార్థులు వెళ్లారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కుంటలోకి భారీగా వర్షం నీరు చేరడంతో కుంటలో ఈతకు దిగిన ఆరుగురు విద్యార్థులు శశి కుమార్, కిన్నెర సాయి, భీమా, సాయి కిరణ్, వీరేంద్ర, మహబాబులు నీటి కుంటలో మునిగిపోయారు. గమనించిన మరో విద్యార్థి దుర్గాప్రసాద్ సమీపంలోని గ్రామంలోకి చేరుకుని జరిగిన విషయాన్ని గ్రామస్తులకు సమాచారాన్ని తెలిపాడు. గ్రామస్తులు వచ్చి నీటి కుంటలో చిక్కుకుపోయిన ఆరుగురు విద్యార్థుల మృతదేహాలను వెలికి తీశారు. దీంతో గ్రామంలోనూ తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న సీఐ గంగాధర్ పోలీసు సిబ్బందితో గ్రామానికి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. విచారణ చేపట్టారు. పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, తహసీల్దార్ రామేశ్వర్ రెడ్డి, ఎంపీడీవో గీతావాణిలు చిగళి గ్రామాన్ని సందర్శించి ప్రమాదం జరిగిన ఘటన వివరాలను అధికారులు, గ్రామస్తులను, విద్యార్థుల కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. నీటి కుంటలో పడి మృతి చెందిన విద్యార్థుల తల్లిదండ్రుల గడపగడపకు వెళ్లి ఓదార్చారు. హైస్కూల్ నిర్మాణపు పనులు జరుగుతున్న కొండ సమీపంలో అక్రమంగా గరుసును తోలడంతో పెద్ద గుంత ఏర్పడి బుధవారం ఆరుగురు విద్యార్థుల మృతికి కారణమైందని గ్రామస్తులు వాపోతున్నారు.

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి టీజీ భరత్: ఆస్పరి మండలం, చిగిలి గ్రామంలో విద్యార్థులు మృతి చెందిన ఘటనపై మంత్రి టీజీ భరత్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆరుగురు విద్యార్థులు మృతి చెందడం ఎంతో కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జరిగిన ఘటనపై జిల్లా కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులు మృతి బాధాకరం - వీరభద్ర గౌడ్: ఈతకు వెళ్లి ఆరుగురు విద్యార్థులు మృత్యువాత పడటం చాలా బాధాకరమని వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆలూరు టీడీపీ ఇంచార్జీ వీరభద్ర గౌడ్ తెలిపారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మండల అధికారులతో ఫోన్లో మాట్లాడి, వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి - ఎమ్మెల్యే విరుపాక్షి: చిగళి గ్రామంలో ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డ విద్యార్థుల మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి ప్రభుత్వాన్ని కోరారు. మంగళ వారం సాయం త్రం గ్రామాన్ని సందర్శించి విద్యార్థుల మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. జరిగిన ఘటనపై గ్రామస్తులతో మాట్లాడారు.

ఎంపీ దిగ్భ్రాంతి : ఆస్పరి మండలం చిగిలి గ్రామంలో నీటి కుంటలో పడి ఆరుగురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై ఎంపీ బస్తిపాటి నాగరాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వర్షాకాల పార్లమెంట్ సమావేశాలలో భాగంగా ఢిల్లీలో ఉన్న ఆయన, ఫోన్ ద్వారా ఘటనకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి సంఘటనలు పునారావృతం కాకుండా తగు చర్యలు చెప్పట్టాలని ఆదేశించారు. స్కూల్ ముగిసిన అనంతరం నీటి కుంటలో ఈత కొట్టెందుకు వెళ్లి ఐదో తరగతి చదువుతున్న ఆరుగురు చిన్నారులు మృతి చెందడం బాధాకరమన్నారు. మృతులు శశి కుమార్, కిన్నర సాయి, సాయి కిరణ్, భీమా, వీరేంద్ర, మహబూబ్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాన్న ఎంపీ, మృతుల కుటుంబాలను ప్రభుత్వం తరుపున ఆదుకుంటామన్నారు.

చిన్నారుల మృతి బాధాకరం - ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి రంగన్న: ఆస్పరి మండలం చిగిలి గ్రామంలో నీటి కుంటలో ఐదో తరగతి చదువుతున్న ఆరుగురు చిన్నారులు మృత్యువాత పడటం అత్యంత దురదృష్టకరం ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి రంగన్న ఓ ప్రకటనలో తెలిపారు. చిన్నారుల తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, తమ బిడ్డల కదలికలను ఒక కంట కనిపెడుతూ, జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదేవిధంగా ఒక్కొక్క కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషన్ ప్రభుత్వం ప్రకటించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రక్షా నోబుల్ హాస్పిటల్ గుర్తింపులు తక్షణమే రద్దు చేయాలి

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన రక్షా హాస్పిటల్, నిర్లక్ష్య వైద్యంతో గర్భిణీ స్త్రీ మృతికి కారణమైన నోబుల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ గుర్తింపును రద్దు చేయాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ కార్యాలయ ఏవో అరుణ కుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్నలు మాట్లాడుతూ కర్నూలు నగరంలో కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న రక్ష హాస్పిటల్‌లో డబ్బుకు ఆశపడి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా లింగ నిర్ధారణ పరీక్ష చేసి, ఓ నిండు గర్భిణీ ప్రాణాలు పోవడానికి కారణమయ్యారన్నారు. రక్ష హాస్పిటల్, సిబ్బందిపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని వారు ప్రశ్నించారు. భ్రూణ హత్యలు నివారించాలని, లింగ నిర్ధారణ చేయరాదని ప్రభుత్వం హెచ్చరిస్తున్నప్పటికీ ఇలాంటి హాస్పిటల్ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతున్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారని మండిపడ్డారు. ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా ఉండాలంటే రక్ష హాస్పిటల్‌ను వెంటనే సిజ్ చేసి హాస్పిటల్ యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎస్ఆర్ పేటలోని నోబుల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో డెలివరీ కోసం వచ్చిన ఒక మహిళకు వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోవడం జరిగిందని, ఈ సంఘటన పైన సమగ్ర విచారణ జరిపించి, నోబుల్ హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. నగరం నడిబొడ్డున ఎంహెచ్ హాస్పిటల్ పేరుతో ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా వైద్య సేవలు చేస్తూ సర్జరీలు సైతం నిర్వహిస్తున్నారని, గతంలో వైద్య శాఖ అధికారి డీఎంహెచ్ఓ దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి వీటి పైన సమగ్ర విచారణ జరిపించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐవైఎఫ్‌గా ప్రత్యక్షంగా హాస్పిటల్లో ముందు ఆందోళన చేయడమే కాకుండా జిల్లా కలెక్టర్, ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి వారిపై చర్యలు తీసుకునేంత వరకు ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామంజి గౌడ్, ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు అభిషేక్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : గ్రామీణ ప్రజలు ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ యాక్ట్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని లీగల్ సర్వీసెస్ యూనిట్ సభ్యులు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు బుధవారం కర్నూలు ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ప్రధాన అధ్యాపకురాలు డాక్టర్ ఇందిరా ప్రశాంతి అధ్యక్షతన పి.సి.ఆర్ చట్టం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్ఏపీ చీఫ్ డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ అడ్వకేట్ శివరామచంద్రరావు, లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, ఎస్సీ, ఎస్టీల హక్కులను కాపాడడంలో ప్రభుత్వ యంత్రాంగం, పోలీసుశాఖ, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు తమ వంతు బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, గురువారం 21, ఆగస్టు 2025

యూరియా కోసం రైతుల ఆందోళన

విశాలాంధ్ర - వెలుగోడు : మండలంలో రైతులు యూరియా కోసం బుధవారం రోడ్డుపై ఆందోళన చేశారు. వెలుగోడు మండలం లో ఇప్పటి వరకు 16వేల 250 ఎకరాలు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారిణి స్వాతి తెలిపారు. ఒక్కో రైతుకు ఎకరాకు 3 బస్తాలు యూరియా అవసరం అవుతాయని, మండలానికి 4 వేల టన్నుల యూరియా అవసరం అవుతుంది. కానీ ఇంత వరకు రైతులకు సరిపోయే స్టాక్ ను అధికారులు పంపిణి చేయలేక పోయారు. రైతులు పంటలు సాగు చేసి 15 రోజులు అవుతున్నా యూరియా అందుబాటులోకి రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెలుగోడు మండలం లో మూడు రైతు సేవా సహకార సోసైటీలు ఉన్నాయి. వెలుగోడు రైతు సేవా సహకార సోసైటీకి ఇప్పటి వరకు సుమారు గా 6000 బస్తాలు యూరియా వచ్చినట్లు సోసైటీ మేనేజర్ జంబూలయ్య చెప్పారు. ఒక్కో రైతు కు ఒక్క రోజు మాత్రమే స్టాక్ ఉన్నందుకు 3 బస్తాలు ఇచ్చామని, ఆ తర్వాత కేవలం రైతుకు ఒక్క బస్తా యూరియా మాత్రమే ఇస్తున్నామని, ప్రస్తుతం 160 బస్తాల స్టాక్ మాత్రమే ఉందని అన్నారు. ఇంకా రైతుల అవసరాన్ని బట్టి 50 టన్నుల యూరియా కావాలని ఇండెంట్ పెట్టినట్లు చెప్పారు. అయితే సోసైటీలో అధికార పార్టీ నాయకుల సిపారసు ఉంటే ఎన్ని బస్తాలైన ఇస్తున్నట్లు గా రైతులు ఆరోపణలు చేస్తున్నారు. అధికారులు కూడా నాయకుల సిపారసు లకు తలోగ్గి ఇష్టానుసారంగా వ్యవహారిస్తున్నట్లు తెలిస్తున్నది. రైతులకు యూరియా సక్రమంగా పంపిణి చేయాలని పలువురు కోరుతున్నారు.

మదర్సాలలో విద్యా వాలంటీర్లను నియమించాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: మదర్సాలలో విద్యా వాలంటీర్లను నియమించాలని మంత్రి ఫరూక్‌కు వినతి పత్రం అందజేశారు. నంద్యాల టిడిపి కార్యాలయం నందు మదర్సాలలో విద్యా వాలంటీర్లను నియమించి చంద్రన్న మదరస నవీన విద్యా విధానం అమలు చేయులని మైనారిటి, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫారుక్‌కు మదర్సా అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యపై మంత్రి ఫరూక్ సానుకూలంగా స్పందించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆరిఫ్, వైస్‌ప్రసిడెంట్ బాను, కార్యదర్శి రిహనా పర్వీన్, ఖాజా, సెక్రటరీ కౌసర్, శంశాద్, మైమునా, మొమిన్, ముంతాజ్ పాల్గన్నారు.

నగర సమగ్ర ప్రగతే లక్ష్యం : బీవై రామయ్య

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగర సమగ్ర ప్రగతే లక్ష్యంగా అభివృద్ధి పనులకు నిధులు ఖర్చు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ మేయర్ బీవై రామయ్య అన్నారు. బుధవారం నగరపాలక కార్యాలయంలో స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. మొత్తం 12 తీర్మానాలు, రూ.4 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు.నగరంలో చెత్తాను సేకరించి గార్గేయపురం డంప్‌యార్డుకు తరలింపునకు 3 నెలల పాటు 10 అద్దె ట్రాక్టర్లను తీసుకొనుటకు రూ.41.86 లక్షలు, 27వ వార్డు శ్రీరామ కాలనీలో డ్రైనేజీ కాలువల నిర్మాణానికి రూ.48.90 లక్షలు, 39వ వార్డు అంబేద్కర్ కాలనీ, సోనియా గాంధీ కాలనీల్లో సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణానికి రూ.36 లక్షలు,19వ వార్డు ట్రైపిస్ట్ కాలనీ, చంద్రశేఖర్ నగర్ నందు సిసి రోడ్డు నిర్మాణానికి రూ.25 లక్షలు, 28వ వార్డు లక్ష్మీపురం నందు రహదారులు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి రూ.40 లక్షలు, 26వ వార్డు విఠల్ నగర్ నందు సిసి రహదారి, డ్రైనేజీ నిర్మాణానికి రూ.49.50 లక్షలు, 37వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీ ట్యాంకు నుండి కోడుమూరు రోడ్డు వరకు పైప్‌లైన్ నిర్మాణానికి రూ.48 లక్షలు, ప్రధాన కూడళ్లలో ఎల్ఈడి డిస్‌ప్లేలను ఏర్పాటుకు రూ.30 లక్షలు,నగర సరిహద్దుల్లో స్వాగత ఆర్చుల ఏర్పాటుకు రూ.30 లక్షలు,50వ వార్డు సంకల్ బాగ్ నందు వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి రూ.49.95 లక్షలు కేటాయించారు.వీధి శునకాల కొరకు శివారు ప్రాంతాల్లో డాగ్ షెల్టర్ ఏర్పాటుకు, వాటి సంరక్షణకు అవసరమైన ఖర్చు చేయుటకు,రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మూడు కేటగిరీల నాన్-పబ్లిక్ హెల్త్ వర్కర్లకు రూ.3,000ల చొప్పున వేతన పెంపు నిధులను సాధారణ నిధుల నుండి ఖర్చు చేయుటకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ పి.విశ్వనాథ్, సభ్యులు మునెమ్మ, షేక్ అహ్మద్, నారాయణ రెడ్డి, సాంబశివరావు, వై.వెంకటేశ్వర్లు, అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్, ఎంఈ మనోహర్ రెడ్డి, ఆర్ఓలు జునైద్, ఇశ్రాయేలు, అకౌంట్స్ ఆఫీసర్ చండి, ఎగ్జామినర్ సుబ్రహ్మణ్యం, సూపరింటెండెంట్ మంజూరు బాష, సినియర్ అసిస్టెంట్ జీఎం శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి ఆద్యుడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకీ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆద్యుడని సిటీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు షేక్ జిలాని బాష కొనియాడారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 81వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు రాజీవ్ గాంధీ చిత్ర పటమునకు పూలమాలలు వేసి పలువురు కాంగ్రెస్ నాయకులు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిలానీ భాష మాట్లాడుతూ కంప్యూటర్, సాంకేతిక టెలీ కమ్యూనికేషన్ల రంగంలో ఆధునిక ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో కొత్తపుంతలు తొక్కిన భారత్, ఇప్పుడు ఆ ఫలితాలను భారత జాతి ఆస్వాదిస్తుందంటే అది రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన సంస్కరణలే కారణమన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ పారిశ్రామిక రంగంలో పన్ను తగ్గింపు విధానాన్ని అవలంభించి, రక్షణ, విమానయాన, వాణిజ్య రంగాలు అభివృద్ధి చెందడానికి కారణం రాజీవ్ గాంధేనని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీత ఏపీఓకి సన్మానం

విశాలాంధ్ర - హొళగుంద: హొళగుంద మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్స్ ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ కంప్యూటర్ ఆపరేటర్స్ ఫీల్డ్ అసిస్టెంట్స్ కార్యా లయ సిబ్బంది తరపున శాలువా పూలమాలతో ఏపీ ఓ తిమ్మా రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగ ఏపీవోతిమ్మారెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లా పీడీ వెంకటరమణయ్య, ఆలూరు క్లస్టర్ ఏపీడి పకీరప్ప కు హొళగుంద ఎంపీడీవో విజయలలితకు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సిబ్బందికి, మండల స్థాయి అధికారుల నుండి జిల్లా స్థాయి అధికారులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్స్ తిరుమలేష్, చిన్న నాగన్న, మల్లన్న, జానయ్య, రామకృష్ణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ ఈరన్న, కంప్యూటర్ ఆపరేటర్స్ ఉమాదేవి, ఎర్రిస్వామి, యూసుఫ్ బాష, ఫీల్డ్ అసిస్టెంట్స్ పి.శ్రీరంగ, రామలింగప్ప రంజాన్ సాబ్ మంజునాథ, ఉలగప్ప, వరమేష్, అనిల్, సిద్ధప్ప, మల్లకార్జున నాయక్, హనుమేష్, మల్లికార్జున, సీనియర్ మేట్ గర్జప్ప వెలుగు కార్యాలయం సిబ్బంది కుమార్ వేణు పాల్గొన్నారు.

నేర నివారణకు సహకరించాలి : కర్నూలు డీఎస్పీ

విశాలాంధ్ర - కర్నూలు : శాంతిభద్రతల పరిరక్షణపై కర్నూలు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూల్ నాల్గవ పట్టణ సీఐ విక్రమ సింహా, కర్నూలు సబ్ డివిజన్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది కలిసి కర్నూలు నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీలో బుధవారం కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. రౌడీషీటర్స్, అనుమానస్పద వ్యక్తుల ఇళ్ళల్లో తనిఖీలు నిర్వహించారు. కౌన్సిలింగ్ చేశారు. ఈ సంధర్బంగా కర్నూలు డీఎస్పీ అక్కడి ప్రజలతో మాట్లాడారు. కర్నూలు పట్టణంలో రాత్రి, పగలు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఎక్కడైనా ఎవరైనా గొడవలు, దౌర్జన్యాలకు పాల్పడితే వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో కర్నూలు పట్టణ సిఐలు విక్రమసింహా, శ్రీధర్, శేషయ్య, పార్థసారథి, మహేశ్వరరెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి పన్ను మదింపు పక్కాగా చేపట్టాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: నగరపాలక సంస్థ ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వీలుగా ఆస్తి పన్ను మదింపును పక్కాగా చేపడుతున్నామని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం చెక్‌పోస్ట్ సమీపంలోని రిలయన్స్ మార్ట్, మల్లికార్జున ఫర్నిచర్, శకుంతల కళామందిర్, రాజ్‌విహార్ దగ్గర క్రోమ వాణిజ్య సముదాయాల నిర్మాణ ప్రాంత విస్తీర్ణ కొలతలను పరిశీలించారు. అదనపు కమిషనర్, డిప్యూటీలు మాట్లాడుతూ నగరంలో అనేక వాణిజ్య, గృహాలకు నిర్మాణ విస్తీర్ణానికి తక్కువగా ఆస్తి పన్ను ఉందని, వాటిని సరిచేసి మదింపునకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. నగరంలో ఆస్తి పన్ను పూర్తి అయితే రూ.15 కోట్ల అదనపు ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఓలు జునైద్, వాజిద్, ఆర్ఐ రాజు, అడ్మిన్లు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా గ్రామోత్సవం

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో భాగంగా త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవ సమితి ఆధ్వర్యంలో గ్రామోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ బాబు, అశోక్,నవీన్, రామకృష్ణారెడ్డి, నాయుడు తదితరుల ఆధ్వర్యంలో శ్రీ శిరిడి సాయిబాబా ఆలయానికి ఎదురుగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పందిరిలో శ్రీకృష్ణుడి ప్రతిమను ఏర్పాటు చేసి, ఐదు రోజులపాటు భక్తులు ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదవ రోజు శ్రీకృష్ణుడి గ్రామోత్సవాన్ని మేళ తాళాలు డప్పుల వాయిద్యాలు భక్తి గీతాలు, గీత ప్రవచనాలు మహిళలు చిన్నారుల భక్తి పాటలు నృత్యాలు ఆనంద ఉత్సవాల మధ్య గ్రామ ఉత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన పల్లకిలో శ్రీకృష్ణుని ప్రతిమను ఉంచి ప్రత్యేక పూజలుతో గ్రామోత్సవాన్ని చేశారు. పట్టణ ప్రధాన వీధులలో పూల బాటలతో గ్రామోత్సవం సాగింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భక్తులు భారీగా తరలివచ్చి దేవదేవుడైన శ్రీకృష్ణుని కనులారా దర్శించి ఉత్సవంలో పాల్గొన్నారు. విచ్చేసిన భక్తులకు ప్రజలకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం గావించారు.

దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి

విశాలాంధ్ర - గూడూరు: రీవెరిఫికేషన్ పేరుతో అర్హులైన దివ్యాంగుల పింఛను నిలిపివేయడం సరికాదని బీజేపీ నాయకులు మల్లేష్ నాయుడు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన దివ్యాంగుల పింఛన్లు నిలుపువేస్తున్నట్లు సచివాలయం ఉద్యోగస్తులు నోటీసులు అందజేయడంతో పింఛన్దారులు ఆందోళన చెంది బుధవారం గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఇంచార్జీ ఎంపీడీవో మధురతకు పింఛన్లు పునరుద్ధరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన దివ్యాంగుల పింఛన్లు నిలిపివేసి కుటుంబ జీవనోపాధికి ఆటంకం కలిగించే విధంగా చర్యలు చేపట్టిందన్నారు. ఇలాంటి చర్యల వల్ల అర్హులైన దివ్యాంగులు బతుకు భారంగా మారుతుందని ప్రభుత్వం వెంటనే పింఛన్లను పునరుద్ధరించాలని కోరారు.

అడవి పందుల దాడి.. మొక్కజొన్న పంట ధ్వంసం

విశాలాంధ్ర - రుద్రవరం : మండల కేంద్రం రుద్రవరం సమీపంలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను అడవి పందులు దాడి చేసి ధ్వంసం చేశాయి. బుధవారం రుద్రవరం గ్రామానికి చెందిన రైతు మాదం చంద్రాయుడు మాట్లాడుతూ తాను సాగుచేసిన మొక్కజొన్న పంటను అడవి పందులు దాడి చేశాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రెండు ఎకరాల్లో పైగా మొక్కజొన్న పంటను వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసి తీర పంట చేతికందే సమయంలో అడవి పందులు దాడి చేసి దాదాపు అర ఎకరంలో మొక్కజొన్నను ధ్వంసం చేశాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.సంబంధిత అధికారులు స్పందించి నష్టపోయిన పంటకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతు కోరారు.

అర్హులైన దివ్యాంగులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర - కోడుమూరు: మండలంలో తొలగించిన 135 దివ్యాంగుల పింఛన్ల ప్రక్రియలో అర్హులైన దివ్యాంగులకు న్యాయం చేయాలని జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి.సురేష్ నాయుడు కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం పట్టణంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి ఏసీ రాముడుకు దివ్యాంగుల పింఛన్ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ టీడీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డితో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ పింఛన్ల తొలగింపు ప్రక్రియలో భాగంగా మండలంలోని 135 మంది దివ్యాంగులకు నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. ఇందులో అర్హులైన దివ్యాంగులందరికీ పింఛన్లు వర్తించేలా వారికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యపై స్పందిస్తూ ఎంపీడీవో ప్రజలైన వారందరికీ దివ్యంగుల పింఛన్లు పంపిణీలో న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పి.రాజశేఖర్, కార్యదర్శి రుబీనా, కృష్ణవేణి, గోరంట్ల మాధవ్, గోరంట్ల సురేష్, మల్లయ్య, మహబూబ్ బాషా, భాస్కర్, మాదయ్య, గిడ్డయ్య, సోమేశ్వరి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ సర్వేంట్ క్రికెట్ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర- ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని స్థానిక వైడబ్ల్యూసిఎస్ గ్రౌండ్ నందు డిజాబుల్డ్ చాలెంజర్స్ క్రికెట్ క్లబ్ సెక్రెటరీ మహమ్మద్ షరీఫ్ ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ డిజాబుల్డ్ చాలెంజర్స్ క్లబ్ క్రికెట్ క్లబ్ 25 ఏళ్ల సిల్వర్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన శ్రీ మాచాని సోమప్ప మెమోరియల్ చాలెంజర్స్ ట్రోఫీ-2025, పబ్లిక్ సర్వేంట్స్ ప్రీమియర్ లీగ్-2025 కార్యక్రమంనకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న డాక్టర్ మాచాని సోమ్ నాథ్, పట్టణ ఎస్ఐ మధుసూదన్ రెడ్డిలు బుధవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరులో 25 ఏళ్ల సిల్వర్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకొని డిజాబుల్డ్ చాలెంజర్స్ ఆధ్వర్యంలో పబ్లిక్ సర్వేంట్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. పబ్లిక్ సర్వేంట్స్ ప్రీమియర్ లీగ్-2025 కార్యక్రమంలో భాగంగా పోలీసులు, మున్సిపల్ సిబ్బంది, ఏపీఎస్పీడీసీ లిమిటెడ్, బార్ అసోసియేషన్ ప్రెస్, ఉపాధ్యాయులు, ఎన్‌జీఓలతో నిర్వహించడం హర్షించదగ్గ విషయమని, క్రికెట్‌లో పాల్గొన్న అందరికి శుభాకాంక్షలు తెలిపారు. గెలుపు, ఓటములు సహజమని, తమ క్రికెట్ నైపుణ్యాం ను ప్రదర్శించి మంచి ఆట తీరు కనబరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ టీమ్ సభ్యులు, ఎన్‌సీసీ విద్యార్థినిలు, డిజాబుల్డ్ చాలెంజర్స్ క్లబ్ సెక్రటరీ షరీఫ్, అన్వర్ బాష, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీల్లో శాంతినికేతన్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల కాంతినగర్ లోని శాంతినికేతన్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన రాష్ట్ర స్థాయి జంప్ రోప్ పోటీలందు అత్యున్నత ప్రతిభ కనబరచి ఆంధ్రప్రదేశ్ జంప్ రోప్ అసోసియేషన్ సెక్రటరీ, సిఈఓల చేతుల మీదుగా పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో విద్యా సంస్థల డైరెక్టర్ సుధాకర్ మాట్లాడుతూ సుధీర్, లోకేష్, గురుతరుణ్, అఖిలేష్ కుమార్, వలిలకు బంగారు పతకాలు, ఓబులేసు, సుకుమార్, యశ్వంత్ నాయక్ లకు వెండి పథకాలు, గురు తరుణ్, లోకేష్ నాయక్, విష్ణు వర్ధన్ లు తామ్ర పతకాలు సాధించినట్లు తెలిపారు.తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించడం ఎంతో సంతోషకరమని అన్నారు. ఇలాంటి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులను సన్నద్ధం చేయడంలో శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీటిని రోడ్లు అంటారా..

వరి నాట్లు నాటుతూ రోడ్డుపై నిరసన

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: కొద్దిపాటి వర్షం పడితే చాలు రోడ్లంతా బురదమయంతో నిండిపోతాయి. గ్రామంలో తిరగడానికి కూడా చోటు ఉండదు. ఎన్ని మార్లు విన్నవించినా పట్టించుకోని అధికారులు గ్రామస్తులు వరి నాట్లు వేస్తూ బుధవారం నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని లక్క సాగరం మజర గ్రామమైన లాల్మన్ పల్లె గ్రామంలో వర్షం వస్తే చాలు రోడ్లంతా బురదతో నిండిపోతుంది రోజంతా అందులోనే నడవాలి, మా పరిస్థితి చాలా దారుణంగా ఉందని గ్రామస్తులు వాపోయారు. గత కొన్ని రోజులుగా పడుతున్న వర్షాలతో గ్రామం అంత చిత్తడే చిత్తడే కాలు పెట్టడానికి సందులేని పరిస్థితి ఉందన్నారు. గతంలో రోడ్లకు మట్టి తోలిచ్చాం అయినప్పటికీ బుజుగులేని బురదగా మారుతుందన్నారు. సీసీ రోడ్లు వేస్తే తప్ప తమ సమస్య పరిష్కారం కాదన్నారు. ఎంతోమంది పాలకులు వచ్చారు వెళ్లారు అయినా తమ బ్రతుకులు మారలేదని, కాలం తగ్గట్టుగా నాగరికత మారిందని, తమ గ్రామం మాత్రం దుర్వ్యవస్థలోనే మిగిలిందన్నారు. రాజకీయ నాయకులు ఎన్నికలు వచ్చిందంటే చాలు గ్రామాల్లో సందడి చేస్తూ ఇంటి ముందుకు వచ్చి అది చేస్తాం, ఇది చేస్తామంటూ భరోసాలు ఇచ్చి పోతారని, గెలిచిన తర్వాత వారి అడ్రస్ గల్లంతయిపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడు తమ గ్రామం బాగుపడుతుందో తెలియదని, తమ జీవితాలు దుర్గంధంలోని మగ్గిపోతాయేమోని వారు ఆవేదన చెందారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి మా గ్రామం వైపు చూసి కనికరిస్తారేమో అని రోడ్లమీద బురదలో వరినాట్లు వేస్తూ నిరసన తెలుపుతున్నామన్నారు.

గోనెగండ్ల మండల కేంద్రంలో.. చిన్న పాటి వర్షం కురిసిందంటే చాలు, శివార్లు ప్రాంతాల్లోని కాలనీల, రహదారులు బురుదమయంగా మారిపోతున్నాయి. అడుగుతీసి, అడుగు వేయదానికి కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ శివారు ప్రాంతలైన చాకలి వీధి, దొనబండ వీధి, ఉప్పరివీధీ, గంజిహళ్లి రోడ్లు, నుంచి కేజీబీవీ పాఠశాలకు, వెళ్లె రహదారులు, చిత్తడి చిత్తడిగా మారుంతున్నాయి. సీసీ రోడ్లు లేక పోవటం, డ్రేనేజీ వ్యవస్థ లేక పోవటంతో వర్షపునీరు, మురుగునీరు అంతా కలిసి పోయి, రోడ్లు బురదగా మారి గుంతలు ఏర్పడుతున్నాయి. వర్షం వచ్చినపుడల్లా నీరుచేరి గుంతలు మరింత పెద్దవిగా మారిపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధింత ఆధికారులు స్పందించి వెంటనే ఈ కాలనీలకు, సీసీ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

గేజ్‌వీల్ దెబ్బకు దెబ్బ తింటున్న రోడ్లు

విశాలాంధ్ర - హొళగుంద: దేశ స్వాతంత్రం సిద్ధించి 79 ఏళ్లు పూర్తి చేసుకున్న మండలంలో ఇప్పటికీ మట్టిరోడ్డే ప్రజలకు దిక్కు అయ్యాయి. వర్షాకాలంలో రోడ్లు చిత్తడిగా, బురద కుంటగా, గుంతల మయంగా మారాయి. ప్రజలు తమ అవసరాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే రోడ్డు సమస్యలు బాధించేవి. హొళగుంద నుండి హెబ్బూరు కొట్టాల వరకు రోడ్డు అధ్వాన స్థితికి చేరుకోవడంతో ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జీ వీరభద్ర గౌడ, తుంగభద్ర ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మిక్కిలినేని వెంకట శివప్రసాద్ ఎంతో శ్రమ వహించి రూ.4 కోట్ల ఉపాధి నిధులను జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్లి సాధించారు. కొత్త రోడ్డును వేయించారు. దీని వల్ల ప్రజల రాకపోకలకు ఎంతో అనుకూలమైనది. కొత్త రోడ్లను ఎంతో బాధ్యతతో చూసుకోవాల్సిన వారు రోడ్డుపై వరి నాట్ల కోసం నారుమడులలో తిప్పే ట్రాక్టర్ గేజ్‌వీల్ దెబ్బకు రోడ్లు దెబ్బతింటున్నాయని ప్రజలు విలేకరుల ముందు ఆవేదన చెందారు. గేజ్ వీల్‌తో పాటు కొందరు రైతులు తమ పొలంలో రోడ్డు వేశారంటూ గట్టు మట్టిని తవ్వి రోడ్డుపై వేశారు. తమ పంట పొలాల కోసం వెళ్లే రస్తా కోసం రోడ్డును అక్కడక్కడ ధ్వంసం చేశారు. ఎంతో కష్టపడి సాధించి నాయకులు రోడ్డు నిర్మిస్తే కొందరు రోడ్డుపై ట్రాక్టర్ ద్వారా గేజ్ వీల్ తిప్పడం వల్ల రోడ్డుపై గేజ్‌వీల్ గుర్తులు స్పష్టంగా కనబడుతున్నాయి. జిల్లా కేంద్రానికి 155 దూరంలో ఉన్న మారుమూల గ్రామాలకు నేతలు, అధికారులు రోడ్డు వేసి, ప్రజా సమస్యలు తీస్తుంటే కొందరు రోడ్డును ధ్వంసం చేయడం పట్ల ప్రజలు ఆవేదన చెందారు. కొత్త రోడ్డును ఇలా చేస్తే భవిష్యత్తు ఎలా అని వాపోయారు.

వేదావతి నది బ్రిడ్జ మరమ్మత్తు చేయాలి

విశాలాంధ్ర - హొళగుంద: మార్లమడికి సమీపంలో ప్రవహించే వేదావతి నదిపై 1997లో నిర్మించిన బ్రిడ్జ్ మరమ్మతు చేయాలని ప్రజలు బుధవారం డిమాండ్ చేశారు. బ్రిడ్జ్ ఇరువైపుల రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయని, గుంతలో వర్షం నీరు నిలబడడం వల్ల రోడ్డు కనవడక వాహనదారులు ప్రమాదవశాత్తు కిందపడి ప్రజలు గాయాల పాలవుతున్నారని వాపోతున్నారు. బ్రిడ్జ్ మధ్యలో సిమెంట్ దిమ్మెలు కొట్టుకుపోయాయని, బ్రిడ్జ్ మీద వాహనాలు అదుపుతప్పి నదిలో పడేతే ఎలా అంటూ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బ్రిడ్జ్ ఇరువైపుల వేసిన రోడ్డు మధ్యలో ఇనుప కడ్డీలు బయటకు తేలాయని, వీటివల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎన్నో ఏళ్ల నుండి బ్రిడ్జి మరమ్మతుకు నోచుకోలేక పోయిందంటున్నారు. ఎంపీపీ నిధులతో కొంతమేరా బ్రిడ్జ్ మరమ్మత్తు పనులు జరిగాయి. బ్రిడ్జ్‌పై రెండు రాష్ట్రాల ప్రజలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తారని, వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని, తుంగభద్ర ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మిక్కిలినేని వెంకట శివ ప్రసాద్, సీనియర్ టీడీపీ నాయకుడు రాజా పంపన్న గౌడ, టీడీపీ నాయకులు కొడాలి వేణుగోపాలరావు, ఎం.శ్రీనివాసరావు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడమే లక్ష్యం

విశాలాంధ్ర - చాగలమర్రి : వ్యవసాయాన్ని లాభసాటిగా చేస్తూ, రైతులకు నూతన సాగు పద్ధతులు మరియు వివిధ పంటలలో చేపట్టవలసిన సస్యరక్షణా చర్యల గురించి అవగాహన కల్పించడం కొరకు ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టడం జరిగిందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు విజయ్‌శేఖర్ తెలిపారు. బుధవారం చాగలమర చాగలమర్రి పట్టణంలో ఏఓ రంగనేతాజీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ ఈ సంవత్సరం మొక్కజొన్న పంట అధికంగా సాగు చేయడం జరిగిందని కనుక ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కత్తెర పురుగు నివారణకు కేవలం రసాయనిక పురుగు మందులపై ఆధారపడకుండా లింగార్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవడం,వేపనూనె పిచికారి చేసుకోవడం మరియు విషపు ఎరల తయారి వంటి వివిధ సస్యరక్షణా చర్యలు చేపట్టాలని తెలియజేసారు. . ప్రధాన్ మంత్రి ఫసల్ భీమా యోజన పథకం క్రింద పంట భీమా కొరకు ఈ నెల 31 వరకు రైతులు తమ వాటా ప్రీమియం చెల్లించుటకు అవకాశం ఉన్నందున తప్పకుండా ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని లేనిచో పంట భీమా పొందే అవకాశం కోల్పోతారని తెలిపారు. అదే విధంగా పంట సాగు చేసే ప్రతి రైతు ఈ పంట నందు నమోదు చేసుకోవాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలో ఎ.ఈ.ఓ మంజుల, గ్రామ వ్యవసాయ సిబ్బంది ఇతర రైతులు పాల్గొన్నారు.

వచ్చే వారం నుండి
పల్లెకు పోదాం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం

- గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం పల్లెకు పోదాం
- 80 మంది స్పెషల్స్ ఆఫీసర్ల నియామకం
- గ్రామాలను బాగు చేయాలన్న సత్సంకల్పంతో అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

విశాలాంధ్ర - కర్నూలు : గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం వచ్చే వారం నుండి పల్లెకు పోదాం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, గ్రామాలను బాగు చేయాలన్న సత్సంకల్పంతో అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. బుధవారం ఉదయం సునయన ఆడిటోరియంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహణపై 80 మంది పల్లెకు పోదాం స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్లతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెలలో ఒకసారి పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందు కోసం 80 మంది జిల్లా అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించామని కలెక్టర్ పేర్కొన్నారు. ముందు రోజు రాత్రి మాత్రమే ఏ గ్రామానికి వెళ్లాలి అనే సమాచారాన్ని అధికారులకు తెలిపారు. ఉదయం 8:30 కు గ్రామానికి చేరుకొని ఆ గ్రామానికి సంబంధించిన పాఠశాలలో ప్రార్థన కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంటుంద న్నారు.. పల్లెకు పోదాం కార్యక్రమం సందర్భంగా గ్రామాల్లో ప్రభుత్వ పథకాలు ఏ విధంగా అమలవుతున్నాయి, అర్హులు ఎవరైనా మిస్ అవుతున్నారా, పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్లు హాస్పిటల్, హాస్టల్ తదితర ప్రభుత్వ సంస్థలు ఎలా పనిచేస్తున్నాయి, తాగునీరు పరీక్షిస్తున్నారా, సక్రమంగా సరఫరా అవుతోందా, ప్రజలకు వైద్య సేవలు ఎలా అందుతున్నాయి, ఇళ్ళ నిర్మాణాలు ఎలా సాగుతున్నాయి, రోడ్ల సదుపాయం, మధ్యాహ్న భోజనం ఎలా ఉంది, పారిశుద్ధ్య కార్యక్రమాలు ఏ విధంగా అమలవుతున్నాయి తదితర అన్ని అంశాలు పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు.. ఆ మేరకు అన్ని శాఖలకు సంబంధించి చెక్ లిస్ట్ లాగా ప్రొఫార్మాలు తయారు చేశామని, ఆయా గ్రామాల్లో ఉన్న సమగ్రమైన పరిస్థితులన్నీ ఆ ప్రొఫార్మాలో పొందుపరచాల్సి ఉంటుందని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రొఫార్మాలను సాఫ్ట్వేర్ లో రూపొందించామని, గ్రామాలను విజిట్ చేసిన తర్వాత ఇందులో వివరాలను అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తదుపరి ఈ సమస్యలను పరిశీలించి ఆయా శాఖల ద్వారా తగిన పరిష్కారం అందించేం దుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు ప్రతి నెలా 80 గ్రామాల చొప్పున ఆరు నెలలకు జిల్లాలోని అన్ని గ్రామాలను విజిట్ చేసే విధంగా కార్యక్రమాన్ని రూపొందిం చామని కలెక్టర్ తెలిపారు. పల్లెకు పోదాం కార్యక్రమం ద్వారా విలేజ్ డెవలప్మెంట్ ప్లాన్ తయారవుతుందని, ప్రణాళికా బద్ధంగా గ్రామాలను అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవడమే ఈ కార్యక్రమం లక్ష్యమని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు ఎంపీడీవోలు తమ, తమ టీములతో స్పెషల్ ఆఫీసర్ వెంట వెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్ఓ వెంకటనారాయణమ్మ, జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి, డీటీసీ శాంత కుమారి, పీడీ హౌసింగ్ చిరంజీవి, డీపీఓ భాస్కర్, ఎస్ఈఆర్‌డబ్ల్యూఎస్ నాగేశ్వరరావు, ఎస్ఈపీఆర్ మద్దన్న, సీపీఓ, జేడీ అగ్రికల్చర్ తదితరులు పాల్గొన్నారు.